E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 16-05-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:133|| పేజీలు–6
www.ekaburu.com

సైబరాబాద్ లో బదిలీల స్ట్రోక్

నిలిచిపోయిన సిఐల బదిలీలు
ఎస్ఐల బదిలీలు గందరగోళమే
కమిషనర్ ఉత్తర్వులకు ముందే పొక్కిన బదిలీల సమాచారం.. ?

ఈ-కబురు, శేరిలింగంపల్లి : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. మే 2వ తేదీన చేపట్టిన ఇనిస్పెక్టర్ల బదిలీలు మధ్యలోనే నిలిచిపోగా, అనంతరం జరిగిన సబ్ ఇనిస్పెక్టర్ల బదిలీలు సైతం గందరగోళానికి దారితీశాయి. సైబరాబాద్ నుంచి హైదరాబాద్ కమిషనరేట్ కు బదిలీ అయిన ఎస్సైలు ఇప్పటికే వెళ్ళిపోగా హైదరాబాద్ నుంచి సైబరాబాద్ లో రిపోర్టు చేయాల్సిన ఎస్ఐలు ఇప్పటికీ జాయిన్ కాకపోవడం విశేషం.

గతంలో ఎన్నడూ లేని విధంగా సైబరాబాద్ లో పోలీసుల బదిలీ ప్రక్రియ గందరగోళం కావడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇనిస్పెక్టర్ల బదిలీల ఉత్తర్వులు వెలువడక ముందే బదిలీ సమాచారం పలువురు బయట వ్యక్తుల చేతికి చేరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సైబరాబాద్ కమిషనర్ గా ఏం. రమేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. ఇదే క్రమంలో కమిషనరేట్ పరిధిలోని పలువురు ఇనిస్పెక్టర్ల బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మే 2వ తేదీన 65 మంది ఇనిస్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

మిగతా 2లో

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

పెట్రోల్, డీజిల్.. లీటరుపై రూ.3 వడ్డన..
సీఎన్‌జీపైనా కిలోకు రూ.2 భారం
రెండేళ్ల తర్వాత మళ్లీ పెరిగిన ధరలు..
అంతర్జాతీయ మార్కెట్లో సెంచరీ కొట్టిన ముడిచమురు

ఈకబురు , న్యూఢిల్లీ: సామాన్యుడిపై మళ్లీ ధరల పిడుగు పడింది. చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. లీటరు పెట్రోల్, డీజిల్‌పై ఏకంగా రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణ యం తీసుకున్నాయి. ఈ పెరిగిన ధరలు శుక్ర వా రం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

మెట్రో నగరాంల్లో ధరలు ఇలా..

నగరం	పెట్రోల్		డీజల్	
	పాత ధర	కొత్త ధర	పాత ధర	కొత్త ధర
డిల్లీ	94.77	97.77	87.67	90.67
కోల్‌కతా	105.45	108.74	92.02	95.13
ముంబై	103.50	106.68	90.03	93.14
చెన్నై	100.80	103.67	92.39	95.25
హైదరాబాద్	107.50	110.89	95.70	98.96

మిగతా 2లో

2034 వరకు నేనే సీఎం

ఆ తర్వాతే జాతీయ రాజకీయాల్లోకి..
పార్టీ చెప్పిన వారికి రాష్ట్రాన్ని అప్పగించి వెళ్తా
వే2న్యూస్ కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
నా అనుభవాన్ని దేశం కోసం ఉపయోగిస్తా..
ప్రధాని పదవి కోసం రాహుల్‌ను నేను ఒప్పించా..
2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీయే ప్రధాని అభ్యర్థి
మోదీ, నేను మైకుల ముందే మాట్లాడుకున్నాం..
జీవితంలో చాలా సౌకర్యంగా, 100 శాతం సంతృప్తితో ఉన్నా
నా ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తారు.. ప్రతిపక్షం కాదు
మైనర్ బాలిక విషయంలో ఎలా అంటే అలా వెళ్లలేం
బండి సంజయ్ తన కొడుకును తెచ్చి పోలీసులకు అప్పగించాలి

02

భారత్‌కు ఇంధన భద్రత

భారత్, యూఏఈ మధ్య ఏడు కీలక ఒప్పందాలు
పెట్రోలియం, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ నిల్వల పెంపునకు యూఏఈ సహకారం
భారత్‌కు ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరాకు ముందుకొచ్చిన అరబ్ ఎమిరేట్స్
యూఏఈ అధ్యక్షుడు అల్–నహ్యాన్‌తో మోదీ భేటీ
వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
పశ్చిమాసియాలో శాంతి సాధనకు సహకరిస్తామన్న ప్రధానమంత్రి

ఈ-కబురు, అబూదాబీ: పశ్చిమాసియాలో శాంతి సాధనకు సహకరించడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయన శుక్రవారం అబూదాబీలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ -నహ్యాన్‌తో సమావేశమయ్యారు. భారత్ -యూఏఈ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. భారత్‌కు ఇంధన భద్రత కల్పించడంతోపాటు రక్షణ, సాంకేతిక రంగాల్లో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా కీలక ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి.

మిగతా 2లో

ముందస్తు బెయిలుపై ఈ దశలో ఉత్తర్వులివ్వలేం



బండి భగీరథ్ కేసులో హైకోర్టు స్పష్టీకరణ
అరెస్ట్ నుంచి రక్షణకు పదే పదే అభ్యర్థించినా నిరాకరణ

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర మంత్రి, భాజపా నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది.

మిగతా 2లో

రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

ఈ-కబురు, రాయలసీమ :
అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు.

మిగతా 3లో

ఒప్పందాల్లేవ్ ఏకాభిప్రాయాలే

చైనాలో ముగిసిన ట్రంప్ పర్యటన

ఈకబురు, బీజింగ్: యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ట్రంప్ చైనా పర్యటన.. ఒప్పంద ప్రకటనలేవీ లేకుండానే ముగిసింది. కీలకాంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని, ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణలో కీలక పురోగతి సాధించామని చెప్పడానికి మాత్రమే అమెరికా, చైనా పరిమితమయ్యాయి. బోయింగ్ సంస్థ నుంచి 200 విమానాలను కొనుగోలు చేయడానికి బీజింగ్ సమ్మతించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించినా..

మిగతా 3లో

ప్రధాని మోదీ పిలుపు సుప్రీంకోర్టు పొదుపు చర్యలు

ఈ-కబురు,: పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది.

నీట్ లీక్ సూత్రధారి.. ఇంటి దొంగే

03

మిచెల్ మార్ష్ మెరుపులు చెన్నైకి చెక్

ఐపీఎల్-19లో ముందంజ వేసే అవకాశం లేని జట్లు.. ప్లేఆఫ్స్ మీద ఆశలు పెట్టుకున్న జట్లను దెబ్బ తీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లున్నాయి.



పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. లీటరు పెట్రోల్, డీజిల్‌పై ఏకంగా రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణ యం తీసుకున్నాయి. ఈ పెరిగిన ధరలు శుక్ర వా రం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఏప్రిల్ 2022 తర్వాత ఇంధన ధరల్లో ఈ స్థాయిలో పెంపు జరగడం ఇదే తొలిసారి. మార్చి 2024లో ఎన్నికల ముందు లీటరుకు రూ.2 మేర రేట్లను తగ్గించిన కేంద్రం.. ఇప్పుడు ఒకేసారి రూ.3 వడ్డించడం గమనార్హం. పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ ధరలు కూడా పెరిగాయి. కిలో సీఎన్‌జీపై రూ.2 వడ్డిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఢిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.79.09కి చేరింది. ఈ పెంపు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో పాటు సొంత వాహనదారులకు భారంగా పరిణమించింది. ధరలు ఎందుకు పెరిగాయి?: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులే ఈ పెంపునకు ప్రధాన కారణం. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ల నుంచి ఏకంగా 100 డాలర్లకు పైగా చేరింది. దీంతో చమురు సంస్థలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి.

ఈ సంస్థలు నెలకు రూ.30,000 కోట్ల నష్టాన్ని మూటగట్టుకుంటున్నాయని పెట్రోలియం మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. నష్టాలను పూడ్చుకునేందుకే ఈ పెంపు నిర్ణయం తీసుకున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల్లో ఎప్పుడో ఇంధన ధరలు 15 శాతం నుంచి 20 శాతం మేర పెరిగినా.

. భారత్‌లో మాత్రం ఆ భారాన్ని ఇప్పటివరకు విని యోగదారులపై మోపలేదు.

ముందస్తు బెయిలుపై ఈ దశలో ఉత్తర్వులివ్వలేం

. ఈలోపు అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులిచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారం వెలువరిస్తామంది. పోక్సో కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి దాదాపు అర్ధరాత్రి 12 గంటల వరకు సుదీర్ఘ విచారణ చేపట్టారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం.. బాలిక వాంగ్మూలం పరిశీలించిన తర్వాత ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. అప్పటివరకైనా పిటిషనర్‌పై ఎలాంటి చర్య తీసుకోకుండా రక్షణ కల్పించాలని, దర్యాప్తునకు సహకరిస్తామని, కనీసం యథాతథస్థితినైనా కొనసాగించేలా ఉత్తర్వులివ్వాలంటూ పదే పదే అభ్యర్థించారు. న్యాయమూర్తి అందుకు నిరాకరించారు. వచ్చే వారం దాకా ఆగకుండా వీలైనంత త్వరగా ఇవ్వాలన్న పిటిషనర్ న్యాయవాది అభ్యర్థనపై పరిశీలిస్తామంటూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

ఫిర్యాదులో పొంతనలేని అంశాలు: పిటిషనర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి

ఎఫ్ఐఆర్ నమోదు చేసినపుడు పెట్టిన సెక్షన్‌ల ప్రకారం అరెస్ట్ అవసరంలేదని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. 'పోలీసులు పిటిషనర్‌ను ఇరికించాలన్న ఉద్దేశంతో కఠిన సెక్షన్‌లను చేర్చారు. డిసెంబరులో సంఘటన జరిగితే ఫిర్యాదుదారు మార్చిలో న్యాయపరమైన చర్చలు జరిపిన తర్వాత మే 8న ఫిర్యాదు చేశారు. ఇప్పటికిప్పుడు జరిగిన సంఘటన కాదు. అలాంటప్పుడు వెంటనే సెక్షన్‌లను మార్చాల్సిన అవసరంలేదు. బాధితురాలి పుట్టిన తేదీలను రెండుగా చూపుతూ దానికి సంబంధించిన పత్రాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాం. అలాగే ఫిర్యాదులో పేర్కొన్న మూడు సంఘటనలు బాలిక ఆమోదం ప్రకారమే జరిగాయి. వారు తల్లిదండ్రుల అనుమతితోనే బయటికి వెళ్లారు. వారు రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. జనవరి 7న రిలేషన్‌షిప్ నుంచి పిటిషనర్ బయటికి రావడంతో కేసులు తెరపైకి వచ్చాయి. ఫిర్యాదులో పేర్కొన్న సంఘటనల తర్వాత కూడా బాలిక, పిటిషనర్ గంటల తరబడి మాట్లాడుకున్నారు. బలవంతంగా మద్యం తాగించారంటూ ఫిర్యాదులో పేర్కొనగా వీడియోలు చూస్తేబాలిక ఇష్టంగా తీసుకున్నట్లు ఆధారాలున్నాయి' అని వాదించారు.

ఫిర్యాదులోనే తీవ్ర ఆరోపణలు: పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు

ఎఫ్ఐఆర్ సవరించకుండానే మొదటిదానిలోనే తీవ్రమైన ఆరోపణలున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 'ఈ ఆరోపణలకు పోక్సో కేసులోని సెక్షన్ 5, 6 వర్తిస్తాయి. పోక్సో కేసు నమోదైనట్లయితే నిందితుడు ముందస్తు బెయిలుకు అనర్హుడు. ఫిర్యాదులోని అంశాల ఆధారంగా సెక్షన్లను సవరించే అధికారం పోలీసులకు ఉంది. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకున్నాక అదనపు సెక్షన్‌లు చేర్చారు. మొదటి ఫిర్యాదులోనే నిందితుడు బలవంతంగా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణ ఉంది. బాలిక పదో తరగతితో సహా వివిధ పాఠశాలల్లో చదివిన సర్టిఫికెట్లు, జీహెచ్ఎంసీ రికార్డుల ఆధారంగా ఫెర్నాండెజ్ ఆస్పత్రి నుంచి ధ్రువీకరణ పత్రాలను పోలీసులు సేకరించారు. ఆమె వాస్తవ జనన తేదీ 2008 ఆగస్టు 12 అని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీని ప్రకారం బాధితురాలి వయస్సు 18 ఏళ్లలోపే ఉంది' అని వాదనలు వినిపించారు.

కేంద్ర మంత్రిగా బెదిరింపులకు పాల్పడ్డారు : ఫిర్యాదుదారు న్యాయవాది పప్పు నాగేశ్వరరావు

నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదుదారు తరపు సీనియర్ న్యాయవాది పప్పు నాగేశ్వరరావు వాదించారు. 'ఈ పరిస్థితుల్లో బాధితులకు ఏం ధైర్యం ఉంటుంది. తన కుటుంబం జోలికి వస్తే వదిలిపెట్టనని, తన కోసం చాలా మంది చనిపోయారని నిందితుడి తండ్రి భయపెట్టారు. నిందితుడు పెళ్లి చేసుకుంటానని ప్రలోభ పెట్టారు. ప్రస్తుతం బాధితురాలు ఒక్కరే కాదు. ఇలాంటి వారు మరో నలుగురున్నారని తెలిసింది. వాళ్లు కూడా త్వరలో బయటికి వస్తారు. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదు' అని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలపై న్యాయమూర్తి ఆందోళన

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రచారాలపై న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ''నాపై జరుగుతున్న దుష్ప్రచారం బాధిస్తోంది. కొంత మంది నన్ను ప్రభావితం చేస్తున్నారని, ఆశచూపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి'' అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి తరపు న్యాయవాదికి చిన్న అభ్యంతరం ఉన్నా వైదొలగుతాననగా.. ఫిర్యాదుదారు తరపు న్యాయవాది అభ్యంతరం లేదని చెప్పడంతో విచారణను చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న దుష్ప్రచారాలపై చర్యలు తీసుకోవాలంటూ నగర పోలీసు కమిషనర్‌కు చెప్పామని పీపీ నాగేశ్వరరావు తెలియజేయగా.. న్యాయమూర్తి స్పందిస్తూ చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు.

సైబరాబాద్ లో బదిలీల స్ట్రోక్

ఈ బదిలీలు పారదర్శకత లేకుండా చేపట్టడం... 11 మంది ఇన్‌స్పెక్టర్లను మల్టీ జోన్ కు సరెండర్ చేయడం వివాదాస్పదంగా మారింది. సీనియారిటీ, పనితీరును పక్కనపెట్టి కేవలం సిఫార్సుల మీదే పోస్టింగ్ లు కేటాయించారనే ప్రచారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ల బదిలీ ప్రక్రియలో సైబరాబాద్ లోని ఒకరిద్దరు ఉన్నతాధికారులు కీలక పాత్ర పోషించి కమిషనర్ ను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు బాహాటంగా వినిపించాయి. ఇన్‌స్పెక్టర్ల బదిలీలు పోస్టింగులపై పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. దీంతో కమిషనర్ జారీ చేసిన ఇన్‌స్పెక్టర్ల బదిలీ ఉత్తర్వులను నిలిపివేసి విచారణకు ఆదేశించినట్లు తెలుస్తుంది.

ఎస్ఐల బదిలీలు గందరగోళమే..

ఓవైపు ఇన్‌స్పెక్టర్ల బదిలీలు గందరగోళం మధ్య నిలిచిపోగా కొన్ని రోజుల్లోనే చేపట్టిన ఎస్ఐల బదిలీల ప్రక్రియ సైతం ఆగమ్య గోచరంగా మారింది. హడావిడిగా ఎస్ఐల బదిలీ ఉత్తర్వులు విడుదల చేసి గంటలో రిపోర్టు చేయాలని ఆదేశించడం విమర్శలకు కారణమైంది. ఎస్ఐల బదిలీ జాబితాలో హైదరాబాద్ కమిషనరేట్ లో పనిచేస్తున్న వారిని సైబరాబాద్ కు బదిలీ చేయడం... సైబరాబాద్ లో పనిచేస్తున్న వారిని హైదరాబాద్ కు బదిలీ చేశారు. సైబరాబాద్ లో పనిచేస్తూ బదిలీ అయిన ఎస్ఐలు ఇప్పటికే వెళ్లిపోయి కొత్త పోస్టింగ్ లో రిపోర్టు చేయగా, వారి స్థానంలో హైదరాబాద్ నుంచి రావాల్సిన ఎస్ఐలు సైబరాబాద్ లో ఇప్పటివరకు బాధ్యతలు స్వీకరించలేదు. దీంతో చాలా పోలీస్ స్టేషన్లు కొన్ని రోజులుగా పూర్తిస్థాయి ఎస్సైలు లేకుండా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

ఉత్తర్వులకు ముందే పోక్కిన బదిలీల సమాచారం... ?

కాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల బదిలీల సమాచారం కమిషనర్ ఉత్తర్వులకు ముందే పలువురు బయటి వ్యక్తులకు చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ కార్యాలయం సిబ్బంది నుంచి ఈ లీకులు జరిగినట్లు ప్రచారం సాగుతుంది. బదిలీల ప్రక్రియలో ఓ ఇద్దరు అధికారులు జోక్యం చేసుకొని పోలీసు బాస్ ను తప్పుదారి పట్టించడంతోనే ఈ గందరగోళం ఏర్పడిందనే చర్చ సాగుతుంది. ఓవైపు చాలా పోలీస్ స్టేషన్ల లో ఎస్ఐల కొరత ఉండగా.. మరోవైపు ఇన్‌స్పెక్టర్ల బదిలీ జాబితాలో ఉన్న ఎస్ హెచ్ ఓలు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఇన్‌స్పెక్టర్లు తిరిగి ఎప్పుడు బదిలీ ప్రక్రియ పూర్తవుతుందో తెలియని సందిగ్ధంలో ఉండిపోయారు.

2034 వరకు నేనే సీఎం

ఈకబురు, హైదరాబాద్: '2034 వరకు నేనే ముఖ్యమంత్రిని. ఆ తర్వాత ఉండను. తర్వాతి తరానికి అవకాశం ఇస్తా. పార్టీ చెప్పిన వారికి రాష్ట్రాన్ని అప్పగించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా. నా అనుభవాన్ని దేశం కోసం ఉపయోగిస్తా..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 2034 వరకు కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు అధికారం ఇస్తారని ఆయన మరోమారు ధీమా వ్యక్తం చేశా రు. 2034 వరకు తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తానని, 10% జీడీపీ దేశానికి ఇచ్చేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతానని అన్నారు. ప్రస్తుతం ప్రజలు 'స్విగ్గీ పాలిటిక్స్' కోరుకుంటున్నారని, ఫలాలు తక్షణమే అందాలనే ఆలోచనతో జెన్‌జీ ఉందని, అందుకు అనుగుణంగా రాజకీయంగా ముందుకెళ్లాల్సి ఉంటుందని అన్నారు.

2029 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున రాహుల్ ప్రధాని అభ్యర్థిగా ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన వే2న్యూస్ కాంక్లేవ్-2026లో ఆయన మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. రాహుల్‌కు ప్రధాని కావాలనే లక్ష్యం లేదు.. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉంది. రాహుల్‌గాంధీ లక్ష్యం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే. ప్రధాని కావాలన్న లక్ష్యం ఆయనకు లేదు. కానీ ప్రధాని పదవి తీసుకోవాలని వికారాబాద్ మీటింగ్‌లో రాహుల్‌ను నేను ఒప్పించా. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్‌గాంధీయే. ఈ మేరకు ఇండియా కూటమిని ఒప్పిస్తాం.

మాట్లాడింది ప్రభుత్వాల సహకారంపైనే..

ప్రధానిగా మోదీ, సీఎంగా నేను ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నాం. మేం మైక్‌ల ముందే మాట్లాడుకున్నాం. ఇందులో రహస్యం లేదు. నిధుల కోసం తమతో కలసిరావాలని మోదీ నన్ను అడిగారు. మేం మాట్లాడుకుంది ప్రభుత్వాల సహకారం గురించి మాత్రమే. చొరవ ఉంది కానీ గీత దాటను..

నేను రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేస్తా. నేను నా మనసుకు నచ్చినట్టు చేస్తా. అవకాశాల కోసం అవకాశవాదిగా మారను. కొంతమంది ఓటమికి కుంగిపోతారు. గెలుపునకు పొంగిపోతారు. కానీ ప్రజాప్రతినిధిగా నా ఆలోచనలో నాకు స్పష్టత ఉంది. నిబద్ధతతో పార్టీలో చేరాననే గాంధీ కుటుంబం నాకు అవకాశమిచ్చింది. సోనియా, రాహుల్, ప్రియాంకల వద్ద నాకు చొరవ ఉంది. కానీ నా గీత నేను దాటను. అప్పుడూ ఇప్పుడూ ఒకే ఇంట్లో..

జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో సీఎం అయ్యాక కూడా అదే ఇంట్లో ఉన్నా. ఇందిరమ్మ ఇంట్లో ఉన్న వెడ్మ బొజ్జు, రూపాయి చేతిలో లేని మందుల సామేల్‌ను ఎమ్మెల్యేలను చేశాం. కష్టపడ్డ నేతలకు నామినేటెడ్ పోస్టులిస్తున్నాం. చాకలి ఐలమ్మ కుటుంబం, శ్రీకాంతాచారి కుటుంబం, కోదండరాం, ఆకనూరి మురళి ఇలా అందరిని గుర్తు పెట్టుకుని పదవులు ఇచ్చాం.

ప్రజల సమస్యలపై అవగాహన ఉంది..

జీవితంలో నేను చాలా సౌకర్యంగా ఉన్నా.. 100 శాతం సంతృప్తితో ఉన్నా. భవిష్యత్తు తరాల కోసం ఏదైనా చేయాలన్నదే నా ఆలోచన. ముఖ్యమంత్రి అయ్యేంత వరకు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నా. ప్రజా సమస్యలపై అవగహన ఉంది. సీఎంగా వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత నాపై ఉంది. గతంలో కులాలు, మతాల వారీగా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇది కుల వ్యవస్థను ప్రోత్సహించినట్లే కదా? నేను సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాను. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌లో అన్ని కులాలు, మతాల విద్యార్థులుంటారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలించాలనుకుంటున్న నన్ను విలన్‌లా చూస్తున్నారు. డ్రగ్స్ తీసుకుంటే ఏ కీలుకు ఆ కీలు తీస్తా.

మూసీ ప్రక్షాళన ఆగదు..

ఎవరు అడ్డువచ్చినా మూసీని ప్రక్షాళన చేస్తాం. నగరాలను కలుషితం చేస్తే మరిచిపోతారు కాని నీటి వనరులను కలుషితం చేస్తే ఎప్పటికీ మరిచిపోరని జపాన్‌లో ఒక సామెత ఉంది. యుద్ధం జరిగినప్పుడు కొందరు అమాయకులు కూడా చనిపోతారు. యుద్ధ నీతే అది. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నాం. ఎవరూ మూసీ మురికిలో ఉండాలని కోరుకోరు. బుర్రలేని లేని వాళ్లు టెండర్లు, కాంట్రాక్టులు మాత్రమే చూస్తారు.. టెండర్లు ఇచ్చి కమీషన్లు తీసుకునే వారి ఆలోచన వేరే ఉంటుంది. నా దగ్గరకి వచ్చి నీకు ఇంత ఇస్తాం పని చేయి అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేదు. రోజుకు 18 గంటలు అధికారులతో సమీక్షలు చేస్తున్నా. నా ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తారు. ప్రతిపక్షం కాదు. వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి వస్తదని కొందరు కలలు కన్నారు. నేను వాస్తవంలో ఉంటా. ఉహాజనితమైన ప్రపంచంలో ఉండను.

అలాగైతే పోక్సో కేసు ఎందుకు పెడతాం..

మేం అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాలు నియంత్రించాం. ఈ నెల 8వ తేదీన రాత్రి మైనర్ బాలిక తల్లి ఒకరు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. 9 తేదీన విచారణ ప్రారంభించి సెక్షన్లు కూడా మార్చి కేసు పెట్టాం. 11 వ తేదీన సెక్షన్లు సవరించి వెంటనే నోటీసులు జారీ చేశాం. ఇదే వ్యవహారంలో బండి సంజయ్ కుమారుడు కరీంనగర్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదులను బేరీజు వేసుకుని అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకొని నోటీసులిచ్చారు. ఈ కేసులో ఎలా పడితే ఎలా చేయడానికి వీల్లేదు. నేను సహాయ పడాలనుకుంటే పోక్సో కేసు పెట్టం కదా? బండి సంజయ్‌కి, బీఆర్ఎస్ మధ్య ఎక్కడ చెడిందో నాకు తెలియదు. కేటీఆర్‌కి, బండి సంజయ్‌కి మధ్య ఏముందో నాకు తెలియదు. కానీ ఎవరైనా తప్పు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తాం. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు ఎవరైనా నాకు మినహాయింపులు లేవు.

బండి సంజయ్ తీరు సరికాదు..

ఆ అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి. అవన్నీ పోలీసులు విచారించాలి. ఒకరోజు ఆలస్యమైనా శిక్ష నుంచి తప్పించుకోలేరు. మేము సత్రం నడపడం లేదు.. ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. మా ప్రభుత్వం బాధితులకు 100 శాతం అండగా ఉంటుంది. కుమారుడి విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా సరైంది కాదు. ఆయన ధైర్యంగా ఎదుర్కోవాలి. కొడుకును తెచ్చి పోలీసులకు అప్పగించాలి.

భారత్‌కు ఇంధన భద్రత

భారత్‌లో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ ముందుకొచ్చిందని మోదీ వెల్లడించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మొదట యూఏఈలో పర్యటించారు. దాదాపు రెండున్నర గంటలపాటు అబూదాబీలో ఉన్నారు. యూఏఈ అధ్యక్షుడితో జరిగిన భేటీలో మాట్లాడుతూ.. యూఏఈపై ఇరాన్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అరబ్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితిని యూఏఈ సంయమనంతో ఎదుర్కొన్న తీరు నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపు

పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మోదీ గుర్తుచేశారు. సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలని కోరుకుంటున్నామని, అందుకోసం తమ వంతు సహకారం కచ్చితంగా అందిస్తామని తేల్చిచెప్పారు. వివాదాలు, ఘర్షణలను చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలన్నదే భారత్ విధానమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఏడు రంగాల్లో వ్యూహాత్మక సహకార ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

యూఏఈ పర్యటనలో భాగంగా ఇంధనం, రక్షణ, మౌలిక సదుపాయాలు, షిప్పింగ్, అధునాతన సాంకేతికత వంటి రంగాల్లో ముఖ్యమైన ఒప్పందాలు కుదిరాయని మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఇది భారత్-యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపునిచ్చిందని తెలిపారు. భారత్‌లో భారీగా పెట్టుబడులకు యూఏఈ సిద్ధం కావడం రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు. యూఏఈలో సంక్షిప్తమైన, అత్యంత ఫలవంతమైన పర్యటన జరిగిందన్నారు.

భారత్-యూఏఈ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై తన సోదరుడు అల్-నహ్యాన్‌తో చర్చించానని పేర్కొన్నారు. ఈ పర్యటన ఫలితాలు ఇరుదేశాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసి, అభివృద్ధి శ్రేయస్సుకు దోహదపడతాయని విశ్వసిస్తున్నట్లు ఉద్ఘాటించారు. అంతకుముందు అబూదాబీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మోదీకి అల్-నహ్యాన్ స్వయంగా స్వాగతం పలికారు. మోదీ పర్యటనకు యూఏఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

ఓడల మరమ్మతుల్లో నైపుణ్యాభివృద్ధి

భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పరిరక్షించే బాధ్యత కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర□వ్స్ లిమిటెడ్ వ్యూహాత్మక సహకారమే లక్ష్యంగా అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల భారత్‌కు ఇంధన భద్రత చేకూరుతుంది. భారతదేశ పెట్రోలియం నిల్వలను పెంపొందించడంతోపాటు ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ నిల్వలను బలోపేతం చేయడానికి అబూదాబీ సంస్థ సహకరిస్తుంది.

ఇండియాకు ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరా, ఆర్థిక స్థిరత్వం, ఇంధన భాగస్వామ్యం లక్ష్యంగా ఎల్పీజీ రంగంలో వ్యూహాత్మక సహకార ఒప్పందంపై సంతకాలు జరిగాయి. రక్షణ పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేయడం, నూతనఆవిష్కరణలను ప్రోత్సహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, జాతీయ, ప్రాంతీయ భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పైనా సంతకాలు చేశారు.

గుజరాత్‌లో ఓడ మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి, ఓడరేవులు, తీరప్రాంత మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి మరో ఒప్పందం కుదిరింది. ఓడల మరమ్మతుల్లో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఇంకో ఒప్పందం కుదుర్చుకున్నారు. భారత్‌లో ఏఐ పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ఒక సూపర్ కంప్యూటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి ఆరో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండియాలో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సంబంధించినది ఏడో ఒప్పందం.

మోదీ విమానానికి ఎస్కార్ట్‌గా యూఏఈ యుద్ధ విమానం

ప్రధాని మోదీ పట్ల యూఏఈ ప్రభుత్వం తన గౌరవాన్ని చాటుకుంది. మోదీ ప్రయాణిస్తున్న విమానం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత యూఏఈకి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం ఎయిర్‌పోర్టు దాకా ఎస్కార్ట్‌గా వచ్చింది. ఇది భారతీయులందరికీ దక్కిన గౌరవమని మోదీ యూఏఈ అధ్యక్షుడితో చెప్పారు. ఎయిర్‌పోర్టులో తనకు స్వయంగా స్వాగతం పలికిన అల్-నహ్యాన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా AMCA ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. AMCA లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ,కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం

"కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని..జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్ , ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని" సీఎం వెల్లడించారు.

గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్

"త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. JGFలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమర్ధవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు.సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి.విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. ఏపీలో డిజైన్ చేయండి, పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని శక్తిగా రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ తయారవుతాయి." అని ముఖ్యమంత్రి వివరించారు.

నాదేశం- నాబాధ్యత

"పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందని...ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని సీఎం అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత కూడా అత్యంత కీలకమని.. ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన 7 అంశాలను ఆచరిద్దాం. పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నాం. దీనిపై ఓ కార్యాచరణను కూడా తీసుకువచ్చాం. వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి అంశాలను అమల్లోకి తీసుకురావాలని కోరుతున్నాను. ప్రతీ భారతీయుడూ ప్రస్తుత సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం వహించాలని" ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఏపీ ఇక అడ్వాన్స్‌డ్ ప్రదేశ్- రాజ్ నాథ్ సింగ్

ఆమ్కా ప్రాజెక్టు ఏపీ సహా దేశ రక్షణలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలతో పాటు రక్షణ రంగ పరిశ్రమల్ని ఆకర్షిస్తున్న ఏపీ పేరు అడ్వాన్స్డ్ ప్రదేశ్ అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. 5 జనరేషన్ ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల్ని తయారు చేస్తున్న రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్దిదేశాల వద్ద మాత్రమే ఉన్నాయని.. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని అన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని చాటేలా మన గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు. ఆ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నామని తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలమని చెప్పారు.

7 సంస్థలతో ఒప్పందాలు

అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు సమక్షంలో 7 సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. రూ. 4460 కోట్ల పెట్టుబడులు, 6400 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఫోర్జ్, రఘువంశీ మెషీన్ టూల్స్ , సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ , ఎన్ఐబీఈ గ్రూప్, పీఎంటీ డిఫెన్స్, చక్రవ్యూహ్ డైనమిక్స్ , ఇండస్ బ్రిడ్జ్ వెంచర్స్ సంస్థలు ఈ ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఆమ్కా ప్రాజెక్టులో నిర్మితం కానున్న అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ నమూనాతో పాటు భారత్ డైనమిక్స్ సహా వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేసిన మిస్సైళ్లు, హ్యాండ్ గ్రెనేడ్లు, టార్పెడో నమూనాలు, ఆధునిక తుపాకుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం తిలకించారు. శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, సవిత, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ సలహాదారు సతీష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

మే 26న కేరళలో ప్రవేశించ నున్న నైరుతి రుతుపవనాలు

ఈకబురు,,న్యూ డిల్లి మే 15 :

ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మే 24న ప్రవేశించినట్లు ఆ శాఖ వెల్లడించింది.

తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది." అని ఐఎండీ పేర్కొంది.

సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐ ఎమ్ డి తెలిపింది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటమే దీనికి కారణం కావచ్చని IMD అభిప్రాయపడింది. రుతుపవన కాలాల్లో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971 2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా నైరుతి

రుతుపవనాలను పిలుస్తారు. నాలుగు నెలల పాటు సాగే ఈ రుతుపవన కాలం దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని అందిస్తుంది. వ్యవసాయానికి, పంటలకు, మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, అలాగే జలాశయాలు, భూగర్భ జలాలను తిరిగి నింపడానికి ఇది అత్యంత కీలకం. మన దేశంలో 50 శాతానికి పైగా నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

ఒప్పందాల్లేవ్.. ఏకాభిప్రాయాలే

దానిపై అధికారిక ప్రకటన రాలేదు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర చర్చల్లో పాల్గొనేందుకు ట్రంప్ బుధవారం బీజింగ్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. గురు, శుక్రవారాల్లో వీరిద్దరూ పలు దఫాలు సమావేశమై.. ఇరాన్ యుద్ధం, ద్వైపాక్షిక వాణిజ్యం సహా పలు అంశాలపై విస్తృత స్థాయిలో సమాలోచనలు జరిపారు. బీజింగ్‌లోని ఝోంగ్నన్హై నివాసంలో సమావేశంతో వారి శిఖరాగ్ర చర్చలు శుక్రవారం ముగిశాయి.

విభేదాలను పరిష్కరించుకున్నాం: ట్రంప్

చైనాలో తన పర్యటనను 'అత్యంత విజయవంతమైనది'గా, 'మరుపురానిది'గా ట్రంప్ అభివర్ణించారు. అమెరికాకు తిరుగుప్రయాణంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ''మేం చాలా విషయాలపై అంగీకారం కుదుర్చుకున్నాం. చాలా ఒప్పందాలు చేసుకున్నాం. విభేదాలను పరిష్కరించుకున్నాం'' అని వ్యాఖ్యానించారు. రాబోయే దశాబ్ద కాలంలో బోయింగ్ నుంచి 200 విమానాలను చైనా కొనుగోలు చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఈ మేరకు తన పర్యటనలో ఒప్పందం కుదిరిందన్నారు. ముందుముందు బోయింగ్ నుంచి మొత్తంగా 750 విమానాలను బీజింగ్ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే దీనిపై బోయింగ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను కొనేందుకూ చైనా సిద్ధమని జిన్‌పింగ్ తనకు చెప్పినట్లు ట్రంప్ తెలిపారు.

ఇరాన్ పనైపోయింది

ఇరాన్ పనైపోయిందని ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడం.. లేదంటే విధ్వంసానికి గురవడం అనే రెండు ఐచ్ఛికాలే ఆ దేశం ముందున్నాయని వ్యాఖ్యానించారు. ఖర్గ్ దీవిని కేవలం 45 నిమిషాల్లోనే నాశనం చేయగలమన్నారు. వాషింగ్టన్‌టెహ్రాన్ మధ్య ఒప్పందం కుదరాలని జిన్‌పింగ్ ఆకాంక్షిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్ నుంచి చమురును కొనుగోలు చేసే చైనా సంస్థలపై ఆంక్షలను ఎత్తివేయడంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి తాను అంగీకరించడాన్ని పాకిస్థాన్‌కు చేసిన మేలుగా ట్రంప్ వ్యాఖ్యానించారు.

అమెరికాచైనా మధ్య ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కమ్యూనికేషన్‌ను, సమన్వయాన్ని బలోపేతం చేసుకోవాలని ట్రంప్, తాను తాజా భేటీలో నిర్ణయించినట్లు జిన్‌పింగ్ పేర్కొన్నారు.

జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు ఈ ఏడాది శరదృతువులో (సెప్టెంబరునవంబరు మధ్య) వెళ్తారని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు.

హర్మూజ్ సహా పలు వివాదాస్పద అంశాలపై ట్రంప్, జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయాల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జైకున్ నేరుగా సమాధానాలివ్వకుండా దాటవేశారు.

బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో అమెరికాచైనా ప్రతినిధుల మధ్య జరిగిన భేటీలో ఒక్క మహిళకు కూడా ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

జిన్‌పింగ్ వ్యాఖ్య.. బైడెన్ హయాం గురించి

అమెరికాను పతనావస్థలోని దేశంగా తన పర్యటనలో జిన్‌పింగ్ వ్యాఖ్యానించడంపై ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో స్పందించారు. ఆ మాటతో తాను 100% ఏకీభవిస్తున్నానని.. కానీ ఆయన చెప్పింది నిద్రమత్తులో ఉండే జో బైడెన్ హయాం గురించి అని పేర్కొన్నారు.

బైడెన్ పాలనలో అమెరికాకు అపార నష్టం వాటిల్లిందన్నారు. తన పాలనలో మాత్రం దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు.

ప్రధాని మోదీ పిలుపు...

ఈకబురు, : పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు (సోమ, శుక్రవారం) పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్ ఫ్రంహోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖులు భద్రతా శ్రేణిలో వాహనాలను తగ్గించుకుంటున్నారు.

నీట్ లీక్ సూత్రధారి..ఇంటి దొంగే



ఈకబురుదిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఓ ప్రొఫెసర్‌ను కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) శుక్రవారం పుణెలో అరెస్టు చేసింది. మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం పుణెలో నివసిస్తున్న ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది. ఈ వ్యవహారంపై ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ ''ఈ కేసులో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సాయంతో ప్రొఫెసర్ కులకర్ణి 2026 ఏప్రిల్ చివరి వారంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి, తన కోచింగ్ సెంటర్‌లో చేర్చుకున్నారు. తరువాత నీట్‌యూజీ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, వాటి ఐచ్ఛికాలను, సరైన సమాధానాలను స్వయంగా డిక్టేట్ చేశారు. ఆయన చెప్పిన ప్రశ్నలను విద్యార్థులు తమ నోట్‌బుక్స్‌లో రాసుకున్నారు. మే 3వ తేదీన జరిగిన నీట్‌యూజీ అసలు పరీక్ష పత్రంతో ఈ నోట్స్ అచ్చుగుద్దినట్లు సరిపోలింది'' అని పేర్కొన్నారు. మనీషా వాఘ్మారేను సీబీఐ ఈ నెల 14న అరెస్టు చేసింది.

నీట్ ప్రవేశ పరీక్ష కోసం గత కొన్ని సంవత్సరాలుగా సన్నద్ధమవుతున్న ఓ విద్యార్థిని దిల్లీలోని అజాద్‌పుర్‌లో ఆత్మహత్య చేసుకుంది. నీట్ పరీక్ష రద్దవ్వడంతోనే మనోవేదన చెంది ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నీట్ అభ్యర్థి రితిక్ మిశ్ర (21) ఆత్మహత్యను వ్యవస్థ చేసిన హత్యగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇంకెంత మంది విద్యార్థులు చనిపోయిన తర్వాత ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. రితిక్ మిశ్ర గురువారం ఆత్మహత్య చేసుకున్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీక్ కేసులో నిందితుడు ధనంజయ్ నివృత్తి లోఖండేను ఆరు రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశాలిస్తూ.. దిల్లీలోని ప్రత్యేక సీబీఐ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

భేషజాలకు పోవద్దు

.. టిమ్స్ ఆసుపత్రులను అందుబాటులోకి తేవాలి: కేటీఆర్

ఈకబురు హైదరాబాద్:

కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా రూ.1200 కోట్లతో ఒక్కో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి కేటీఆర్ (KTR) అన్నారు. సనత్ టిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్న అనంతరం స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో, భారత రాష్ట్ర సమితి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు.''హైదరాబాద్‌కు నాలుగు వైపులా టిమ్స్ ఆసుపత్రులకు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ ప్రభుత్వం ఉండి ఉంటే.. రెండేళ్ల క్రితమే టిమ్స్ పూర్తయ్యేది. కేసీఆర్ శ్రీకారం చుట్టారు.. ఆయనకు పేరు వస్తుందని భేషజాలకు పోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా. ఇప్పటికైనా స్పందించి సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్, గచ్చిబౌలి టిమ్స్, ఎంజీఎం వరంగల్, నిమ్స్ విస్తరణ పనులను సత్వరమే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి'' అని కేటీఆర్ కోరారు.

అదానీపై కేసు ఉపసంహరణ

అమెరికాలో పరిష్కారానికి చేరువగా మరికొన్ని దావాలు

న్యూయార్క్/దిల్లీ: అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై అమెరికాలో జరుగుతున్న పలు కేసులు పరిష్కారం దిశగా వెళుతున్నాయి. ఇప్పటికే ఒక సివిల్ కేసును సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) వద్ద సెటిల్ చేసుకోగా, న్యాయ విభాగం, ఆర్థిక శాఖ కూడా తమ సమాంతర దర్యాప్తులను రాబోయే రోజుల్లోనే ముగించనున్నాయని సంబంధిత వ్యక్తులు వెల్లడించారు. భారత్‌లో సౌర ఇంధన ప్రాజెక్టులకు సంబంధించి, అమెరికా ఇన్వెస్టర్లకు వెల్లడించిన సమాచారం విషయంలో అదానీ, ఆయన సోదరుడి కుమారుడైన సాగర్ అదానీపై వచ్చిన ఆరోపణలను యూఎస్ ఎస్ఈసీ గురువారం సెటిల్ చేసుకుంది. తప్పు చేసినట్లుగా అంగీకరించకుండా, ఖండించకుండా గౌతమ్ అదానీ 6 మి. డాలర్లు (రూ.57 కోట్లు), సాగర్ అదానీ 12 మి. డాలర్లు (సుమారు రూ.114 కోట్లు) చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు రికార్డులు చెబుతున్నాయి. వీరిద్దరిపై క్రిమినల్ ఆరోపణలను వెనక్కి తీసుకోవడానికి యూఎస్ న్యాయ విభాగం (డీఓజే) సిద్ధమవుతున్నట్లు సమాచారం. సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందడానికి భారత్‌లో కొందరు పాలనాధికారులకు 265 మి. డాలర్ల (అప్పటి మారకపు ధర ప్రకారం రూ.2029 కోట్లు) లంచం ఇచ్చారని, ఈ నిధులను అమెరికా ఇన్వెస్టర్లు, బ్యాంకుల నుంచి సమీకరించారన్నది 2024 నవంబరులో నమోదైన ఆరోపణలు. తాము తప్పు చేయలేదని, బలమైన పాలన, నియమ ప్రమాణాలను పాటిస్తున్నామని అదానీ గ్రూప్ చెబుతూ వచ్చింది. లంచం కేసులో ఎటువంటి విశ్వసనీయ సాక్ష్యం లేదని అదానీ తరపు లాయర్లు వాదిస్తూ వచ్చారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై చేపట్టిన దర్యాప్తు కూడా పరిష్కారం దిశగా వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ పరిష్కారమైతే అదానీ గ్రూప్‌నకు న్యాయపరమైన చిక్కులు తొలగినట్లే.

అదానీ 'విడుదల' కోసమే వాణిజ్య ఒప్పందం
ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు

దిల్లీ: గౌతమ్ అదానీ 'విడుదల' కోసమే అమెరికాతో మనదేశానికి వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ సంతకాలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. మనదేశానికి అనుకూలంగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోలేకపోయినా, అదానీ విడుదలకు బేరసారాలు చేశారని ఆరోపిస్తూ ఎక్స్‌లో రాహుల్ పోస్ట్ చేశారు. 'అమెరికాకే ప్రయోజనాలు కలిగించే వాణిజ్య ఒప్పందానికి ఎందుకు మోదీ అంగీకరించారో ఇపుడు స్పష్టమైంద'ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌ను మే 10న హఠాత్తుగా ఎందుకు నిలిపేశారో కూడా స్పష్టమవుతోంది. దేశ ప్రయోజనాల కంటే ట్రంప్ బెదిరింపులకే మోదీ లొంగిపోయారు. ట్రంప్ ప్రభుత్వం అదానీపై ఉన్న అన్ని కేసులూ అందుకే ఉపసంహరించుకుంటోందేమో' అని ఎక్స్‌లో అన్నారు.

టోకు ధరలకు 'ఇంధన' మంట

ఏప్రిల్‌లో 8.3%, 42 నెలల గరిష్ఠమిది



పశ్చిమాసియా ఉద్రిక్తతలు సృష్టించిన ఇంధన సంక్షోభ ప్రభావంతో, దేశీయంగా టోకు ధరలు భగ్గుమన్నాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 8.3 శాతానికి పెరిగింది. ఇది 42 నెలల గరిష్ఠం. ఈ ఏడాది మార్చిలో డబ్ల్యూపీఐ 3.88% కాగా.. 2025 ఏప్రిల్‌లో 0.85 శాతంగా నమోదైంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాక.. అంతర్జాతీయంగా ముడి చమురు ధర బాగా పెరిగింది. దీనికి తోడు సరఫరా పరమైన అవరోధాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇళ్లలో వినియోగించే వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరను మార్చిలో రూ.60 పెంచారు. వాణిజ్య సిలిండర్ ధరను మాత్రం 3 విడతల్లో రూ.1300కు పైగా పెంచి రూ.3,000 చేశారు. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించకున్నా, బల్క్ డీజిల్ ధరను పెంచారు. ముడిచమురుతో ముడిపడిన ఉత్పత్తుల ధరలన్నీ పెరగడంతో, కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను సవరించాయి. ఈ ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై పడింది. ఏప్రిల్ నెలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

ఏప్రిల్‌లో ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠమైన 24.71 శాతానికి పెరిగింది. మార్చిలో ఇది 1.05 శాతంగా ఉంది. క్రూడ్ పెట్రోలియమ్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 88.06 శాతంగా నమోదైంది. 2021 అక్టోబరు తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణ రేటు మార్చిలో 1.9% కాగా, ఏప్రిల్‌లో 1.98 శాతానికి పెరిగింది. ఆహారేతర పదార్థాల ద్రవ్యోల్బణ రేటు 11.5% నుంచి 12.18 శాతానికి చేరింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 3.39% నుంచి 4.62 శాతానికి పెరిగింది.

ఇంధనం, విద్యుత్ విభాగం....:

ఏప్రిల్‌లో ఎల్‌పీజీ ద్రవ్యోల్బణం 10.92 శాతానికి పెరిగింది. మార్చిలో ఇది 1.54 శాతంగా ఉంది. పెట్రోలు ద్రవ్యోల్బణ రేటు 2.5% నుంచి 32.40 శాతానికి; హై స్పీడ్ డీజిల్ ద్రవ్యోల్బణ రేటు 3.26% నుంచి 25.19 శాతానికి చేరింది. లోహాలు, రసాయనాలు, జౌళి ఉత్పత్తుల తయారీ వ్యయాలు పెరగడమూ, డబ్ల్యూపీఐ గణనీయ వృద్ధికి దారితీసింది.

సమీప భవిష్యత్తులో ఇంకా పెరుగుతుంది.....

ఇంధన అధిక ధరల ప్రభావం తయారీ రంగం ద్వారా వినియోగదార్లకు బదిలీ కానుండటంతో, మేలో టోకు ద్రవ్యోల్బణం 9 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టరు మేఘా అరోరా తెలిపారు. పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలు సవరించకపోవడం, ఇంధనానికి డబ్ల్యూపీఐలో అధిక వెయిటేజీ ఉన్నందున.. రిటెయిల్ ద్రవ్యోల్బణం కంటే టోకు ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతోందని వివరించారు. టోకు ద్రవ్యోల్బణ ప్రభావం, వినియోగదార్లకు కాస్త నెమ్మదిగా చేరుతుందన్నారు. ఎల్‌నినో వల్ల వర్షాలు సరిగా పడకపోతే, ద్రవ్యోల్బణం మరింత భారమవుతుందని పేర్కొన్నారు.

రూపాయి దిగులు.. చమురు గుబులు

లాభాల నుంచి నష్టాల్లోకి మార్కెట్లు
ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1329 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.1959 కోట్లు

దేశీయ సూచీలు శుక్రవారం లాభాల్లో ప్రారంభమైనా, నష్టాల్లో ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు కనిష్ఠమైన 96 స్థాయికి పడిపోవడం, ముడిచమురు ధర మళ్లీ పెరగడం ఇందుకు ప్రధాన కారణం. లోహ, చమురుగ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచడంతో మదుపర్లను ద్రవ్యోల్బణ భయాలు కలవరపెట్టాయి. బ్యారెల్ ముడిచమురు ధర 3% పెరిగి 109.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నీ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.26 లక్షల కోట్లు తగ్గి రూ.460.59 లక్షల కోట్ల (4.8 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 99 పాయింట్ల (క్రితం ముగింపు 75,398.72) లాభంతో 75,497.10 పాయింట్ల వద్ద ప్రారంభమై, ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 75,139.41 పాయింట్లకు పడిపోయింది. చివరకు 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.10 పాయింట్లు తగ్గి 23,643.50 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. టాటా స్టీల్ 1.97%, ఎటర్నల్ 1.93%, రిలయన్స్ 1.87%, అల్ట్రాటెక్ 1.83%, ఎస్‌బీఐ 1.69%, ఎం అండ్ ఎం 1.56%, బీఈఎల్ 1.22%, ఎల్ అండ్ టీ 0.85% డీలాపడ్డాయి. ఇన్ఫోసిస్ 2.08%, టెక్ మహీంద్రా 1.86%, పవర్‌గ్రిడ్ 1.34%, అదానీ పోర్ట్స్ 1.27%, మారుతీ 1.14%, ఎయిర్‌టెల్ 1.13% లాభపడ్డాయి. చమురు, రంగుల షేర్లు డీలా: పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నేపథ్యంలో చమురు మార్కెటింగ్, రంగుల కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. చమురు కంపెనీల్లో బీపీసీఎల్ 2.71%, హెచ్‌పీసీఎల్ 2.39%, ఐఓసీ 1.85% పడ్డాయి. ఇండిగో పెయింట్స్ 1.36%, ఏషియన్ పెయింట్స్ 0.42%, బెర్జర్ 0.14% నష్టాలు నమోదుచేశాయి.

భారీగా పసిడి, వెండి దిగుమతులు

ఏప్రిల్‌లో వరుసగా 82%, 157% పెరిగాయ్
రాబోయే నెల్లో తగ్గే అవకాశం

దిల్లీ: మనదేశంలోకి పసిడి, వెండి దిగుమతులు ఏప్రిల్‌లో భారీగా పెరిగాయి. ఈ లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని పెంచినందున, రాబోయే నెల్లో ఈ దిగుమతులు తగ్గొచ్చని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. శుక్రవారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. పసిడి దిగుమతులు 81.69% పెరిగి 5.62 బి. డాలర్ల (సుమారు రూ.52,000 కోట్ల)కు చేరుకున్నాయి. వెండి దిగుమతులు 157.16% వృద్ధితో 411 మి. డాలర్ల (దాదాపు రూ.3,800 కోట్ల)కు చేరాయి. 202526 మొత్తం మీద 71.98 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.69 లక్షల కోట్ల) పసిడి దిగుమతి అయ్యింది. 202425 కంటే విలువ పరంగా ఇది 24% అధికం. పరిమాణం పరంగా 4.76% తగ్గి 721.03 టన్నులకు పరిమితమైంది, యూఏఈకి ఇచ్చిన టారిఫ్ కోటా మినహాయింపు (టీఆర్‌క్యూ) వాటా ఇందులో 8.58 టన్నులే ఉందని అగర్వాల్ తెలిపారు. 2025-26లో వెండి దిగుమతులు 150% వృద్ధితో 12 బి. డాలర్లకు చేరుకున్నాయి. పరిమాణ పరంగా 42% పెరిగి 7334.96 టన్నులుగా నమోదైంది.

మొత్తం ఎగుమతుల్లో 13.78% వృద్ధి....

ఏప్రిల్‌లో మొత్తం భారత ఎగుమతులు 13.78% పెరిగి 43.56 బి. డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. వృద్ధి పరంగా ఇవి 5 నెలల గరిష్ఠం కాగా, పరిమాణం పరంగా నాలుగేళ్లలోనే అత్యధిక నెలవారీ ఎగుమతులు ఇవే. అయితే దిగుమతులు కూడా 10% పెరిగి 71.94 బి. డాలర్ల (సుమారు రూ.6.76 లక్షల కోట్ల)కు చేరుకోవడంతో వాణిజ్య లోటు ఏప్రిల్‌లో మూడు నెలల గరిష్ఠమైన 28.38 బి. డాలర్ల (దాదాపు రూ.2.66 లక్షల కోట్ల)కు చేరుకుంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమా, దేశ ఎగుమతులు ఆరోగ్యకర వృద్ధిని నమోదు చేశాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులు (40.31%), మాంసం, డెయిరీ (48%), పెట్రోలియం ఉత్పత్తులు (34.66%), ఇంజినీరింగ్ వస్తువులు (8.76%), ఫార్మా (7.12%) వంటివి రాణించడంతో ఎగుమతుల్లో మంచి వృద్ధి సాధ్యమైంది.

డాలర్ @ రూ.96

సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం
అంతర్జాతీయ విద్య మరింత భారం

అమెరికా డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ మరింత కనిష్ఠ స్థాయికి చేరింది. పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధరలను పెంచడంతో, రవాణా దగ్గర నుంచి అన్ని రకాల వస్తు, సేవల వ్యయాలు అధికమయ్యే పరిస్థితి ఉంది. ఈ ఏడాది జనవరిలో డాలర్ విలువ రూ.90 కాగా, ఇప్పుడు రూ.96కు చేరడంతో, దిగుమతి చేసుకునే వస్తువులన్నీ ఖరీదవుతున్నాయి. డాలర్ చెల్లింపులతో ముడిపడినవన్నీ ఆర్థిక భారం కలిగించడం ఖాయం. ఏ దేశ కరెన్సీ విలువ జీవనకాల కనిష్ఠాలకు చేరినా అది హెచ్చరికలాంటిదే. నెలవారీ నిత్యావసరాల బిల్లు, రోజువారీ ప్రయాణ వ్యయాలు, అంతర్జాతీయ విద్యా ఖర్చులు మరింత అధికమవుతాయి. ఆహార వస్తువులు, వంట నూనెలు, ప్యాకేజ్డ్ వస్తువుల ధరలూ క్రమంగా పెరుగుతాయి. మనదేశం నుంచి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు లక్షల్లో ఉంటారు. వీరికి నెల వారీ పంపించాల్సిన మొత్తం అంతకంతకూ పెరుగుతోంది. రూపాయి మారకపు విలువ 5.5% క్షీణిస్తే.. నెలవారీ రూ.50,000 బడ్జెట్‌తో బండి నడిపే మధ్యతరగతి కుటుంబ కొనుగోలు శక్తి, రూ.2,5003,500 వరకు తగ్గుతుందన్నది ఒక లెక్క. దీనిని దృష్టిలో పెట్టుకునే 'ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని' ఇటీవల ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

రూపాయిపై ఎందుకు ఒత్తిడి..

శుక్రవారం నాటి ఇంటర్‌బ్యాంక్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రా డే ట్రేడింగ్‌లో ఆల్‌టైం కనిష్ఠమైన 96.14కు చేరింది. చివరకు 95.86 వద్ద స్థిరపడింది. ముగింపు పరంగా ఇది కూడా రికార్డు కనిష్ఠ స్థాయే. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువ 6% క్షీణించింది. గత 6 ట్రేడింగ్ రోజుల్లోనే 2% తగ్గింది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధ ప్రభావం మరింత తీవ్రరూపం దాల్చొచ్చనే అంచనాల మధ్య ముడిచమురు ధర పెరుగుతోంది. అమెరికాలో రిటెయిల్ విక్రయాలు బాగుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్ రేట్ల కోత విధిస్తారనే అంచనాల మధ్య డాలర్ సూచీ రాణించింది. మనదేశ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులను ఉపసంహరిస్తూనే ఉండడమూ ప్రభావం చూపుతోంది. ఇవన్నీ కలిసి రూపాయిపై ఒత్తిడి పెంచాయి. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే, రూపాయికి కొంతమేర మద్దతు లభించొచ్చని విశ్లేషకులు అంటున్నారు.

ఇక రిటర్నులు దాఖలు చేయొచ్చు

హైదరాబాద్: పన్ను చెల్లింపుదారులు 202627 మదింపు సంవత్సరానికి గాను ఐటీఆర్1, ఐటీఆర్4లను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు శుక్రవారం నుంచే వీలు కల్పించినట్లు ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. ఈ ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీ, ఆన్‌లైన్ ఫైలింగ్ సౌకర్యం ఆదాయపు పన్ను ఇఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని ఐటీ విభాగం వెల్లడించింది. 2025 26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేయడానికి వీలుగా ఈ ఫారాలను మార్చి 30నే నోటిఫై చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్ ఫైలింగ్, ఎక్సెల్ యుటిలిటీ అందుబాటులోకి రావడంతో పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నుల దాఖలును ప్రారంభించొచ్చు.

జులై 31 వరకు: వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్1 దాఖలు చేయడానికి జులై 31ని చివరి తేదీగా నిర్ణయించారు. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్4 దాఖలు చేసేందుకు ఆగస్టు 31 వరకు గడువు ఉంది.

ఎవరికి ఏ ఫారాలు?.....

ఐటీఆర్1 (సహజ్): వార్షికాదాయం రూ.50 లక్షల లోపు ఉన్నవారు ఈ ఫారాన్ని సమర్పించాలి. జీతం, ఒక ఇంటి ద్వారా వచ్చే ఆదాయం, ఇతర వనరుల (వడ్డీ, డివిడెండ్లు) ద్వారా వచ్చే ఆదాయంతో పాటు, వ్యవసాయ ఆదాయం ఏడాదికి రూ.5,000 లోపు ఉన్నవారు దీనిని ఉపయోగించవచ్చు. ఏడాదికి రూ.1.25 లక్షల వరకు ఉన్న దీర్ఘకాలిక మూలధన లాభాలనూ ఇందులో చూపించేందుకు అవకాశం కల్పించారు. ఐటీఆర్4 (సుగమ్): వ్యాపారం, వృత్తి ద్వారా రూ.50 లక్షల వరకు వార్షికాదాయం పొందుతున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) దీన్ని ఉపయోగించి, రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో భారత్ క్లౌడ్ ఏఐ కేంద్రం

BharathCloud
Cloud Journey Simplified

హైదరాబాద్: కృత్రిమ మేధ ఆధారిత క్లౌడ్ సేవల సంస్థ భారత్ క్లౌడ్, హైదరాబాద్‌లో తొలి క్లౌడ్ కేంద్రాన్ని ప్రారంభించింది. కంట్రోల్ఎస్ డేటా సెంటర్‌లో దీన్ని ఏర్పాటు చేసింది. దేశంలో క్లౌడ్ మౌలిక సదుపాయాల కల్పన కోసం అయిదేళ్లలో రూ.950 కోట్ల పెట్టుబడులు పెడతామని సంస్థ తెలిపింది. ప్రభుత్వాలు, సంస్థల డిజిటల్ వేదికలకు మద్దతు ఇచ్చేలా, దేశీయ ఏఐ-రెడీ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించినట్లు కంట్రోల్ఎస్ సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి తెలిపారు. భారత్ క్లౌడ్ సహ వ్యవస్థాపకులు రాహుల్ తక్కళ్లపల్లి, పద్మా రెడ్డి సామ మాట్లాడుతూ.. దేశంలో విశ్వసనీయ క్లౌడ్ వ్యవస్థను నిర్మించేందుకు, కంట్రోల్ ఎస్ సామర్థ్యాలు ఉపకరించినట్లు పేర్కొన్నారు.

ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..

నష్టాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 96.15 వద్ద కనిష్ఠాన్ని తాకి 95.94కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది.

ఇరుముడి!



కథానాయకుడు రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో రవితేజ కోసమే పలు కథలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. రవితేజతో సినిమా చేయనున్న దర్శకులుగా ఇటీవల వివేక్ ఆత్రేయ, హనిత్ గోలి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీళ్లు రవితేజకి ఇప్పటికే కథల్ని చెప్పి ఒప్పించినట్టు తెలుస్తోంది. ఆ కలయికల్లో సినిమాలు ఎప్పుడు పట్టాలెక్కుతాయో తెలియదు కానీ, కథలు మాత్రం పక్కాగా సిద్ధమైనట్టు సమాచారం. ప్రముఖ దర్శకుడు మారుతి దగ్గర కూడా రవితేజ కోసం ఓ స్క్రిప్ట్ ముస్తాబవుతున్నట్టు తెలిసింది. రవితేజ వేగంగా సినిమాలు చేయడంలో దిట్ట. ఆయన కోసం సిద్ధమైన కథలకు తగ్గట్టుగా వేగం పెరిగితే మాత్రం వెంట వెంటనే సినిమాలు ప్రేక్షకుల ముందు కొచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'ఇరుముడి' మొదలుకొని, ప్రచారంలో ఉన్న సినిమాలన్నీ కూడా కలయికల పరంగా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నవే.

ఏడాదైనా నిండని కూతురు గురించి బోల్డ్ కామెంట్స్

భరత్ అనే నేను, గేమ్ ఛేంజర్ లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమున్న హీరోయిన్ కియారా అడ్వాణీ.. త్వరలోనే 'టాక్సిక్'తో రాబోతుంది. ప్రస్తుతం గ్లామరస్ ఫొటోషూట్స్ చేస్తూ దర్శకనిర్మాతలని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏడాది కూడా నిండని తన కూతురి భవిష్యత్ గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. వాటిపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కియారా అడ్వాణీ.. కూతురు గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 'ఆమె (సరయూ) పూర్తి జీవితం చూడాలని అనుకుంటున్నాను. ఒక్కరితో డేటింగ్ చేయాలని రూలేం లేదు. ఈ విషయంలో ఆమెకు ఎలాంటి ఆంక్షలు విధించను. పెళ్లి చేసుకోవాలనుకుంటే ఓకే లేదంటే లేదు. డేట్ చేసిన ప్రతి ఒక్కరినీ పెళ్లి చేసుకోవాలని లేదు. నాకు అలానే జరిగింది. చివరకు సరైన వ్యక్తి దొరికాడు. ఎదిగే క్రమంలో ఈ బంధాలు.. అన్ని పాఠాలు నేర్పిస్తాయి. మనల్ని మనిషిగా మారుస్తాయి. జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. పొరపాట్లు అందరూ చేస్తారు. కానీ వాటి నుంచే నేర్చుకుంటారు' అని కియారా స్టేట్‌మెంట్ ఇచ్చింది. కియారా చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కనీసం ఏడాది పూర్తి కాని కూతురి గురించి మాట్లాల్సిన మాటలేనా ఇవి అని పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు. ఇదేం ఫెమినిజం అని ప్రశ్నిస్తున్నారు. ఇదే సంస్కృతి అని ఫైర్ అవుతున్నారు. కియారా మాట్లాడిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని కియారా ప్రేమించి 2023లో పెళ్లి చేసుకుంది. గతేడాది జూలైలో వీళ్లకు కూతురు పుట్టింది.

కొన్ని చిత్రాలు నాకో పీడకల



నేటి కాలంలో నిజాన్ని మరీ ఎక్కువగా మాట్లాడితే సినిమా కూడా ఆగిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటోంది బాలీవుడ్ కథానాయిక సోనాక్షి సిన్హా. వైవిధ్యమైన కథలతో ఇటు వెండితెరపై.. మరోవైపు ఓటీటీ వేదికగానూ సత్తా చాటుతున్న నాయికీమె. త్వరలో ఈ భామ.. నటి జ్యోతికతో కలిసి 'సిస్టమ్' అనే లీగల్ డ్రామాతో అమెజాన్ ప్రైమ్ వేదికగా అలరించడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనాక్షి.. రాబోయే ఈ సినిమా, తన కెరీర్ ప్రారంభ రోజులు, పరిశ్రమ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.''ప్రస్తుత కాలంలో ఒక కథను నిజాయతీగా చెప్పడం చాలా కష్టమైపోతుంది. క్రియేటర్స్‌గా మనం క్లిష్టమైన సమయాల్లో ఉన్నాం. గతంలో ఉన్నంత స్వేచ్ఛ ఇప్పుడు మాకు లేదు. నిజాన్ని మాట్లాడటం ఇప్పుడు కష్టంగా మారింది. సమాజంలోని యథార్థమైన నిజాలను తెరపైకి తీసుకురావాలంటే భయపడాల్సిన వాతావరణం ఉంది. ప్రస్తుత పరిస్థితుల వల్ల కథలను ఎంచుకునేటప్పుడు దర్శకనిర్మాతలు కూడా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. వివాదాలకు దూరంగా ఉండే ఇతివృత్తాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు రాబోయే 'సిస్టమ్' వ్యవస్థలోని లోసుగులను ప్రశ్నించేదే అయినా... ఇలాంటి కథలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సవాల్‌తో కూడుకున్న పని''. దీనికి సోషల్ మీడియా ఓ కారణం''నేను చిత్రపరిశ్రమకు వచ్చి 15ఏళ్లకు పైగానే అవుతుంది. అప్పటి నుంచి నా ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే.. నేను సినీరంగంలోకి అడుగుపెట్టినప్పటితో పోలిస్తే.. ఇప్పుడు పరిశ్రమ చాలా మారిపోయింది. అందుకు సోషల్ మీడియా పెరుగుదల కూడా ఒక కారణమే. అప్పట్లో సోషల్ మీడియా ఉన్నప్పటికీ.. దాని ప్రభావం అంతగా ఉండకపోయేది. అందుకే నేను కాస్త అనుకూలమైన సమయంలోనే చిత్రపరిశ్రమకు వచ్చానని అనిపిస్తోంది. అనుభవం నన్ను మెరుగైన నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దడమే కాకుండా ఒక వ్యక్తిగా నాలో మార్పును కూడా తీసుకువచ్చింది. నేను పని మొదలు పెట్టినప్పుడు అక్షరాలా ఒక పసిపాపను. అప్ప

ఆర్థిక సవాళ్లను సమష్టిగా అధిగమిద్దాం: కమల్‌హాసన్

అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని, బాధ్యతాయుతమైన సినిమా నిర్మాణ పద్ధతులను అవలంబించాలని భారతీయ చిత్రపరిశ్రమను కోరుతూ అగ్రహీరో కమల్ హాసన్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ లేఖను పంచుకున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభ ప్రభావంతో ఏర్పడుతున్న పరిస్థితులను గుర్తుచేస్తూ.. సినిమా నిర్మాణ వ్యయాలను తగ్గించే దిశగా మార్పులు చేసుకోవాలని.. దీనిపై భారతీయ పరిశ్రమ తక్షణమే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.''పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. ఇంధనం, వాణిజ్యం, రవాణా, ఆర్థిక స్థిరత్వం లాంటి అంశాలపై ప్రపంచం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ఇంధనం, విద్యుత్, రవాణా, నిర్మాణ వ్యయాల ప్రభావాన్ని భారతదేశం కూడా అనివార్యంగా అనుభవిస్తోంది. బడ్జెట్లు ఇప్పటికే పెరుగుతున్న, మార్కెట్ పునరుద్ధరణలు అస్థిరంగా ఉన్న సమయంలో భారతీయ చలన చిత్రపరిశ్రమకు ఇది ఎదురైంది. పెరుగుతున్న వ్యయాలు కేవలం చిత్ర నిర్మాణాన్ని మాత్రమే ప్రభావితం చేయవు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా రాబోయే నెలల్లో వినోదం కోసం వినియోగదారుల వ్యయ విధానాలు కూడా మారవచ్చు. ఈ భారం నిర్మాతలు, కార్మికులు, థియేటర్లు, పంపిణీదారులు, ఫైనాన్షియర్లు.. ఇలా మొత్తం వ్యవస్థపై పడుతుంది. ఖర్చు చేసే ప్రతి రూపాయి సినిమాకే ఉపయోగపడాలి తప్ప.. భారీ స్థాయిలో ఉన్నట్లు కనిపించడానికి కాదు.

సినిమా ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి సవరణ అయినా కార్మికుల వేతనాలు, భద్రత, గౌరవం, ఆహారం, వసతి.. లాంటి వాటికి నష్టం కలిగించేలా ఎప్పటికీ ఉండకూడదు. దానికి బదులుగా వృథా, అతిగా ఆర్భాటాలు పెంచుకోవడం అనసరమైన విదేశీ ప్రయాణాలు, నిర్మాణంలో జాప్యాలను నివారిస్తే బాగుంటుంద''ని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ''ప్రతి ప్రేమకథ పారిస్‌లోనే ఎందుకు వికసించాలి?.. ప్రతి హనీమూన్ స్విట్జర్లాండ్‌లోనే ఎందుకు ముగియాలి? అదృష్టవశాత్తూ ప్రేమకు విదేశీ మారక ద్రవ్యం అవసరం లేదు. కానీ భారతీయులు తమపై..

మన అందమైన దేశంపై మరింత విశ్వాసాన్ని కలిగి ఉండాలి. భారతీయ చిత్రపరిశ్రమ ఏకాభిప్రాయానికి రావడానికి ఇదే సరైన సమయమని నమ్ముతున్నా. రాబోయే ఆర్థిక సవాళ్లను మనం సమష్టిగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై పరిశ్రమలోని నిర్మాతలు, నటీనటులు, దర్శకులు, ఎగ్జిబిటర్లు..

ఇతర యూనియన్ల మధ్య చర్చలు జరగాలని నేను కోరుతున్నా. ఇది వ్యక్తిగత ప్రయోజనాల కన్నా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం. ఈరోజు మనం సినిమా ఆర్థిక వ్యవస్థను కాపాడితే.. రేపు సినిమా భవిష్యత్తును కాపాడినట్లే'' అని కమల్ తన లేఖను ముగించారు.

ప్రత్యేక గీతంతో 'నేను రెడీ'

బాలీవుడ్ కథానాయిక నర్గీస్‌ఫక్రీ తన అందచందాలతో తెలుగు ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు సిద్ధమైంది. ప్రత్యేక గీతాలకు పెట్టింది పేరైన ఆమె తన తొలి తెలుగు చిత్రాన్ని యువ కథానాయకుడు హవీశ్‌తో కలిసి చేసింది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో, హవీశ్ హీరోగా 'నేను రెడీ' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులోనే నర్గీస్‌ఫక్రీ ఓ ప్రత్యేక గీతం చేసింది. ఇటీవలే ఆ పాటని తెరకెక్కించారు. నర్గీస్ అందంతో ఈ పాట మరింత ప్రత్యేకంగా మారిందని సినీ వర్గాలు చెప్పాయి. హార్నిక్స్ ఇండియా పతాకంపై కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది.

అతిథిగా జాక్వెలిన్ మెరుపులు?

వైవిధ్యమైన పాత్రలతో ప్రయాణం చేసే కథానాయిక యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'నయీ నవేలి'. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు సమాచారం. ''జాక్వెలిన్ ఇందులో అతిథిగా కనిపించినా.. ఆమె పాత్ర కథాంశానికి కీలకంగా ఉండనుంది. ప్రస్తుతం ఈ విషయాన్ని చిత్రబృందం గోప్యంగా ఉంచుతున్నప్పటికీ.. ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేసిందామె. ఇంతక ముందు జాక్వెలిన్, యామి.. 'భూత్ పోలీస్' చిత్రంలో కలిసి నటించారు'' అని బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. జానపద కథల నుంచి ప్రేరణ పొందిన హారర్ కామెడీగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆనంద్ ఎల్.రాయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరి ప్రత్యేక పాటలతో అలరించే జాక్వెలిన్.. ఈసారి అతిథిగా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

సీఎం విజయ్‌కు చిరంజీవి ఫోన్..

తమిళనాడు సీఎం విజయ్‌కు మెగాస్టార్ చిరంజీవి ఫోన్ చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ప్రజాకేంద్రీకృత పాలనతో తమిళనాడు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని మెగాస్టార్ సూచించారు. దివంగత మహానేత ఎంజీఆర్‌లా ప్రజల ప్రేమాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. చిరంజీవి మాటలకు సీఎం విజయ్ కూడా స్పందించారు. ఇటీవలే మన శంకర వర ప్రసాద్ గారు చిత్రాన్ని వీక్షించినట్లు తెలిపారు. మిమ్మల్ని తెరపై చూడటం ఎంతో ఆనందంగా అనిపించిందన్నారు. జననాయగన్ పైరసీ విషయంలో సపోర్ట్ చేసినందుకు విజయ్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న చిరంజీవి రాబోయే చిత్రానికి విజయ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రామ్ దర్శకత్వం

యువ కథానాయకుడు రామ్ పోతినేని మెగాఫోన్ పట్టుకోనున్నారు. తన 23వ చిత్రానికి తానే దర్శకత్వం వహిస్తున్నట్టుగా శుక్రవారం ఓ కొత్త పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించారు. ఆయన సోదరుడు కృష్ణ పోతినేని రాపో సినిమాటిక్స్ పతాకంపై నిర్మించనుండడం విశేషం. శుక్రవారం రామ్ పుట్టినరోజు. ఈ సందర్భంగానే తన కొత్త ప్రయాణానికి సంబంధించిన సంగతుల్ని వెల్లడించారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో రామ్ పోతినేని వీరా పాత్రలో సందడి చేయనున్నారు. ఒంటరి తోడేలు కథ... అంటూ పోస్టర్‌లో సూచించారు. రామ్ స్వయంగా సిద్ధం చేసిన కథతో రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణని జూన్‌లో ప్రారంభించి, డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. రామ్ కథానాయకుడిగానే కాకుండా, గాయకుడిగా, గేయ రచయితగా ప్రతిభని చాటారు. అందరి ప్రేమ, ఆశీస్సులతో ఈ కొత్త ప్రయాణం ప్రారంభిస్తుండడం ఆనందంగా ఉందన్నారు రామ్. ఆయన ఇందులో స్టైలిష్ అవతారంలో సందడి చేయనున్నట్టు పోస్టర్ చాటుతోంది.

ఫిఫా ప్రపంచకప్

గీతం విడుదల

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్ సమీపిస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా సాకర్ అభిమానుల్లో ఉత్సాహం పెంచే దిశగా టోర్నీ అధికారిక గీతాన్ని ఫిఫా విడుదల చేసింది. 'డై డై' అంటూ సాగే ఈ గీతాన్ని ప్రఖ్యాత కొలంబియా పాప్ సింగర్ షకీరా, నైజీరియా గాయకుడు బుర్నా బాయ్ కలిసి పాడారు. షకీరా ఫిఫా ప్రపంచకప్ గీతాన్ని ఆలపించడం ఇదే తొలిసారి కాదు. ఈ పాట బహు భాషల సంగమంగా రూపొందింది. ఆఫ్రికాలో జరిగిన 2010 ప్రపంచకప్ సందర్భంగా ఆమె పాడిన 'వాకా వాకా' పాట సాకర్, సంగీత ప్రియులను ఒక ఊపు ఊపేసింది. అమెరికా, కెనడా, మెక్సికో ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే ఫిఫా ప్రపంచకప్ వచ్చే నెల 12న ఆరంభం కానుంది.

మిచెల్ మార్ష్ మెరుపులు చెన్నైకి చెక్

ఐపీఎల్19లో ముందంజ వేసే అవకాశం లేని జట్లు.. ప్లేఆఫ్స్ మీద ఆశలు పెట్టుకున్న జట్లను దెబ్బ తీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు ముంబయి ఇండియన్స్ ఇలాగే చెక్ పెడితే.. ఇప్పుడు చెన్నై సూపర్‌కింగ్స్‌ను లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ దెబ్బ తీసింది. సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన ఆకాశ్ సింగ్ బంతితో సీఎస్కేకు బ్రేకులేస్తే.. మిచెల్ మార్ష్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను ప్రత్యర్థి నుంచి లాగేశాడు. 12 మ్యాచ్‌ల్లో ఆరో ఓటమిని ఖాతాలో వేసుకున్న చెన్నై.. మిగతా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి తీరాల్సిందే. అయినా ముందంజ వేస్తుందనే గ్యారెంటీ లేదు.

ఈ ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ చేజారాక లఖ్‌నవూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. శుక్రవారం ఆ జట్టు 7 వికెట్ల తేడాతో చెన్నైని మట్టికరిపించింది. మొదట సీఎస్కే 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. ఆకాశ్ సింగ్ (3/26) ధాటికి దెబ్బ తిన్న చెన్నైకి.. కార్తీక్ శర్మ (71; 42 బంతుల్లో 6×4, 5×6), శివమ్ దూబె (32 నాటౌట్; 16 బంతుల్లో 3×4, 2×6) పోరాడే స్కోరు నందించారు. కానీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (90; 38 బంతుల్లో 9×4, 7×6) చెలరేగి ఆడి చెన్నైకి అవకాశం లేకుండా చేశాడు.

ముందే తేల్చేశాడు: ఐపీఎల్‌లో బ్యాటింగ్ కష్టంగా సాగే మైదానాల్లో ఎకానా స్టేడియం ఒకటి. దీంతో 188 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి లఖ్‌నవూ కష్టపడాల్సి ఉంటుందని, చెన్నైకి గెలవడానికి మంచి అవకాశాలుంటాయని అనిపించింది. కానీ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఛేదన తేలికై పోయింది. ఏ చెన్నై బౌలర్‌నూ లెక్క చేయని అతను.. చాలా ముందే మ్యాచ్ ఫలితాన్ని తేల్చేశాడు. 4 ఓవర్ల వరకు కాస్త ఆచితూచి ఆడిన మార్ష్.. ఈ సీజన్లో నిలకడగా రాణిస్తున్న అన్షుల్ కాంబోజ్‌ను అయిదో ఓవర్లో లక్ష్యంగా చేసుకున్నాడు. వరుసగా 6, 6, 6, 6 బాదిన అతను.. ఒక బంతి విరామమిచ్చి, ఫోర్ కూడా కొట్టాడు. ఈ ఓవర్లో మొత్తం 28 పరుగులు వచ్చాయి. తమ దేశ బౌలర్ స్పెన్సర్ జాన్సన్‌ను కూడా ఈ ఆస్ట్రేలియా బ్యాటర్ వదిలిపెట్టలేదు. అతను వేసిన ఆరో ఓవర్లో 4, 4, 6 బాదాడు. 21 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తయింది. మరో ఎండ్‌లో ఇంగ్లిస్ కూడా వీలుచిక్కినపుడల్లా బౌండరీలు బాదాడు. 11 ఓవర్లకు 129/0తో ఎల్ఎస్‌జీ తిరుగులేని స్థితికి చేరుకుంది. మార్ష్ చూస్తుండగానే 90లోకి వచ్చేశాడు. సెంచరీ ఖాయమనుకుంటే.. దురదృష్టవశాత్తూ అతను రనౌటయ్యాడు. ఇంగ్లిస్ ఔటవడంతో క్రీజులోకి వచ్చిన పూరన్.. తాను ఎదుర్కొన్న తొలి బంతికి షాట్ ఆడాడు. దాన్ని ఆపే ప్రయత్నంలో ముకేశ్ చౌదరి చేతిని తాకించగా.. అది స్టంప్‌ను తాకడంతో మార్ష్ వెనుదిరగాల్సి వచ్చింది. కాసేపటికే అబ్దుల్ సమద్ (7) కూడా ఔటైనా.. ఎల్ఎస్‌జీకి ఇబ్బంది లేకపోయింది. మార్ష్ కొట్టిన దెబ్బ సరిపోదని.. కాంబోజ్‌ను పూరన్ కూడా బాదేశాడు. అతను వేసిన 17వ ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించాడు.

ఆకాశ్ పంచ్.. కార్తీక్ ఎదురుదాడి: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన చెన్నై.. పరుగుల కోసం కష్టపడాల్సి వచ్చింది. ఇన్నింగ్స్‌ను పేలవంగా ఆరంభించిన ఆ జట్టు.. 187 పరుగులు చేయడం గొప్పే. ప్రతికూల పరిస్థితుల్లో పట్టుదలతో నిలుస్తూ యువ బ్యాటర్ కార్తీక్ శర్మ కీలక ఇన్నింగ్స్ ఆడడం.. ఆఖర్లో శివమ్ దూబె మెరుపులు మెరిపించడంతో ఆ జట్టు అంత స్కోరు చేయగలిగింది. ప్లేఆఫ్స్ అవకాశాలు కోల్పోయాక యువ పేసర్ ఆకాశ్ సింగ్‌కు లఖ్‌నవూ ఈ సీజన్లో తొలి అవకాశం ఇవ్వగా.. ఇన్నాళ్లూ అతణ్ని ఆడించనందుకు చింతించేలా సాగింది అతడి ప్రదర్శన. వరుసగా 4 ఓవర్ల స్పెల్ వేసిన ఆకాశ్.. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ (13), సంజు శాంసన్ (20)లతో పాటు ప్రమాదకర ఉర్విల్ పటేల్ (6)ను సైతం ఔట్ చేసి చెన్నైని గట్టి దెబ్బ తీశాడు. ఆ జట్టు 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 61 పరుగులే చేసింది. ఈ స్థితిలో కార్తీక్ శర్మ పట్టుదలతో నిలిచాడు. బ్రెవిస్ (25; 16 బంతుల్లో 2×6) నుంచి అతడికి సహకారం అందడంతో చెన్నై పుంజుకుంది. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదిన బ్రెవిస్.. తర్వాత కొంచెం నెమ్మదించినా, కార్తీక్ మాత్రం పదే పదే బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన అతను.. షమి బౌలింగ్‌లో సిక్సర్‌తో అర్ధశతకం (35 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. షాబాజ్ వేసిన 16వ ఓవర్లో కార్తీక్ 6, 4, 4తో టాప్ ఫామ్ అందుకున్నాడు. కానీ అదే ఓవర్లో అతణ్ని ఔట్ చేసి షాబాజ్ ప్రతీకారం తీర్చుకున్నాడు. అంతకన్నా ముందే బ్రెవిస్ ఔటైపోయాడు. 1618 మధ్య 3 ఓవర్లలో 22 పరుగులే ఇచ్చిన ఎల్ఎస్‌జీ.. చెన్నైకి బ్రేకులేసింది. అయితే తొలి 12 బంతుల్లో 12 పరుగులే చేసిన శివమ్ దూబె.. ప్రిన్స్ వేసిన ఆఖరి ఓవర్లో చివరి నాలుగు బంతులకు 6, 4, 4, 6 బాది చెన్నైకి ఊహించని స్కోరునందించాడు.

అన్షుల్ కాంబోజ్.. ఈ సీజన్లో నిలకడగా రాణిస్తున్న పేసర్లలో ఈ చెన్నై యువ పేసర్ ఒకడు. లఖ్‌నవూతో పోరుకు ముందు 11 మ్యాచ్‌ల్లో 19 వికెట్లతో టాప్ 3 బౌలర్‌గా ఉన్నాడు కాంబోజ్. అప్పటికి అతడి ఎకానమీ కూడా 9 లోపే ఉంది. కానీ శుక్రవారం అతడిని మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ ఆటాడుకున్నారు. వీరి ధాటికి కాంబోజ్ 2.4 ఓవర్లలోనే 63 పరుగులు సమర్పించుకున్నాడు. ఎకానమీ 23.62 కావడం గమనార్హం. కాంబోజ్ వేసిన 5వ ఓవర్లో మార్ష్ వరుసగా నాలుగు సిక్సర్లు బాదితే.. 17వ ఓవర్లో పూరన్ కూడా అదే శిక్ష విధించాడు.

స్కోరు వివరాలు

చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ (సి) ముకుల్ (బ) ఆకాశ్ 20; రుతురాజ్ (సి) పూరన్ (బ) ఆకాశ్ 13; ఉర్విల్ (సి) మార్ష్ (బ) ఆకాశ్ 6; కార్తీక్ శర్మ (సి) మార్‌క్రమ్ (బ) షాబాజ్ 71; బ్రెవిస్ (సి) ఆకాశ్ (బ) షమి 25; దూబె నాటౌట్ 32; ప్రశాంత్ నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 187

వికెట్ల పతనం: 1-31, 2-36, 3-52, 4-122, 5-142

బౌలింగ్: షమి 4-0-41-1; ఆకాశ్ సింగ్ 4-0-26-3; ప్రిన్స్ యాదవ్ 4-0-49-0; మయాంక్ యాదవ్ 4-0-26-0; షాబాజ్ అహ్మద్ 4-0-45-1

లఖ్‌నవూ ఇన్నింగ్స్: మార్ష్ రనౌట్ (ముకేశ్) 90; ఇంగ్లిస్ (సి) ఉర్విల్ (బ) ముకేశ్ 36; పూరన్ నాటౌట్ 32; సమద్ (బ) స్పెన్సర్ జాన్సన్ 7; ముకుల్ నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 10, మొత్తం: (16.4 ఓవర్లలో 3 వికెట్లకు) 188

వికెట్ల పతనం: 1-135, 2-135, 3-144

బౌలింగ్: ముకేశ్ 3-0-24-1; స్పెన్సర్ 4-0-39-1; కాంబోజ్ 2.4-0-63-0; నూర్ 4-0-21-0; గుర్జప్‌నీత్ 3-0-34-0

టికెట్ల మంట

హైదరాబాద్: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి మ్యాచ్ ఆడుతున్నాడంటే స్టేడియాలు నిండకుండా ఉంటాయా.. పైగా ఈసారి ఐపీఎల్‌లో జోరుమీదున్నాడు.. గత మ్యాచ్‌లో అజేయ శతకంతో చెలరేగాడు కూడా. అతడి ఆటను చూసేందుకు అభిమానులు పోటెత్తడం ఖాయం. అందుకే ఆ అభిమానాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ సొమ్ము చేసుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 22న ఉప్పల్ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ టికెట్ల ధరల్ని సన్‌రైజర్స్ అమాంతం పెంచేయడమే ఇందుకు కారణం. దాదాపుగా ప్లేఆఫ్స్ చేరుకున్న ఆర్సీబీ తొలి రెండు స్థానాల్లో నిలిచేందుకు.. ఎస్ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్ చేరేందుకు విజయం కీలకం అయ్యే అవకాశముండటంతో ఈ మ్యాచ్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు టికెట్ల అమ్మకాలు ప్రారంభించగా.. సుమారు 4 లక్షల మంది వరుసలో ఉండటం గమనార్హం. ఉప్పల్ స్టేడియం సామర్థ్యం 39,000 కాగా.. ఎన్నో రెట్లు అదనంగా అభిమానులు పోటీలో నిలిచారు. అయితే టికెట్ల ధరలు భారీగా పెరగడం అభిమానుల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. గత మ్యాచ్‌తో పోల్చితే రేట్లు 20 నుంచి 30 శాతం పెరిగాయి! ఒక్కో టికెట్ ధరను కనిష్టంగా రూ.1950.. గరిష్టంగా రూ.45,000గా సన్‌రైజర్స్ నిర్ణయించింది. సౌత్ రెండో అంతస్తులో కార్పొరేట్ బాక్సులో టికెట్ ధర రూ.45,000 కావడం గమనార్హం. వెస్ట్ రెండో అంతస్తులో కార్పొరేట్ బాక్సులో రూ.30,000.. ఆరెంజ్ ఆర్మీ ఈస్ట్, వెస్ట్ లాంజ్‌లలో రూ.20,000 ధరతో టికెట్లను అమ్మకానికి పెట్టింది. సాధారణ ప్రజలు ఎక్కువ కొనే ఈస్ట్, వెస్ట్ స్టాండ్ల ఫస్ట్ ఫ్లోర్ రూ.4,500.. గ్రౌండ్ ఫ్లోర్ రూ.6,000గా ధరలు నిర్ణయించింది. నార్త్ స్టాండ్ రెండో టెర్రస్ రూ.1,950 టిక్కెట్ ధరే అన్నింటి కంటే తక్కువ. ఆ తర్వాత వరుసగా రూ.2,050.. రూ.3,250.. రూ.3,500.. రూ.4,500.. రూ.6,000.. రూ.9,000.. రూ.10,000.. రూ.12,000.. రూ.13,000.. రూ.20,000.. రూ.30,000.. రూ.40,000గా ధరలు ఉన్నాయి. టికెట్ ధరలను అమాంతం పెంచేసినా కొన్ని గంటల్లోనే అన్నీ అమ్ముడైనట్లు యాప్‌లో కనిపించడం గమనార్హం.

వివాదంలో అర్ష్ దీప్

ధర్మశాల: పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. ఇప్పటికే ముంబయి ఇండియన్స్ ఆటగాడు తిలక్‌వర్మపై చేసిన వ్యాఖ్యలతో విమర్శలు ఎదుర్కొంటున్న అర్ష్‌దీప్.. తాజాగా స్నాప్‌చాట్‌లో ఒక అభిమానికి ఇచ్చిన ఘాటు సమధానం తీవ్ర దుమారం రేపుతోంది. పంజాబ్ పేరును అర్ష్‌దీప్ చెడగొడుతున్నాడని.. అతను జట్టుకు తలవంపులు తెస్తున్నాడని ఒక అభిమాని స్నాప్‌చాట్‌లో వ్యాఖ్యానించాడు. దీనిపై అర్ష్‌దీప్ స్పందిస్తూ.. "సింగ్ సాబ్.. మీరు పంజాబ్ కోసం ఏం చేశారు? ఇప్పటికీ చిప్స్, కూల్ డ్రింక్స్ కోసం ఇంట్లో డబ్బులు అడిగే వారు నాకు సలహాలు ఇస్తున్నారా?" అని పేర్కొన్నాడు. ఈ సంభాషణకు సంబంధించిన స్క్రీన్ షాట్లు వైరల్ కావడంతో నెటిజన్లు అర్ష్‌దీప్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ముంబయితో మ్యాచ్‌కు ముందు సామాజిక మాధ్యమంలో పంచుకున్న ఓ వీడియోలో తిలక్ రంగునుద్దేశించి 'ఓయ్.. అంధేరా' అంటూ అర్ష్‌దీప్ సంభోదించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

హార్దిక్.. గాయం వల్లే

ధర్మశాల: ముంబయి ఇండియన్స్‌తో హార్దిక్ పాండ్యా బంధం ముగిసిందా అన్న ఊహాగానాలకు తెరపడింది. గాయం కారణంగానే హార్దిక్ గత మూడు మ్యాచ్‌లు ఆడలేదని ఆ జట్టు పేసర్ శార్దూల్ ఠాకూర్ స్పష్టం చేశాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌కు హార్దిక్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉందని చెప్పాడు. "హార్దిక్ గాయపడటంతో గత మూడు మ్యాచ్‌లకు అందుబాటులో లేడు. ప్రస్తుతం అతను ముంబయిలో శిక్షణ తీసుకుంటున్నాడు. ఈనెల 20న ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్‌తో మ్యాచ్‌కు తిరిగి వస్తాడని ఆశిస్తున్నా. హార్దిక్ లాంటి నాణ్యమైన ఆటగాడి సేవల్ని జట్టు కోల్పోతోందనడంలో సందేహం లేదు" అని శార్దూల్ పేర్కొన్నాడు.

నేనేంటో రుజువు చేయాల్సిన పని లేదు

తనకు క్రికెట్ అన్నా, బ్యాటింగ్ అన్నా ఎంతో ఇష్టం కాబట్టి ఆటలో కొనసాగుతున్నా తప్ప.. ఎవరికీ తనేంటో రుజువు చేయడానికి కాదని భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి స్పష్టం చేశాడు. 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే అనుకుంటున్నట్లు చెప్పిన విరాట్.. అందుకోసమే కష్టపడుతున్నట్లు చెప్పాడు. అయితే తాను విలువ చేకూరుస్తానని భావిస్తేనే జట్టులో ఉంటానని.. విలువ రెండు వైపుల నుంచీ ఉండాలని అతను వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో తాను ప్రాతినిధ్యం వహించే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కోసం చేసిన ఒక పాడ్‌కాస్ట్‌లో కెరీర్‌కు సంబంధించి కొన్ని విషయాలపై విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆ విశేషాలు తన మాటల్లోనే...

ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు. ఏదైనా సిరీస్‌కు రెండు మూడు వారాల ముందు సిద్ధమయ్యే వ్యక్తిని కాదు నేను. ఏడాదిలో ఏ రోజైనా సిద్ధంగా ఉంటా. నువ్వు రాబోయే సిరీస్‌లో ఆడాలంటే అందుకు సిద్ధమని చెబుతా. ఎందుకంటే నా జీవనమే అందుకు తగ్గట్లుగా ఉంటుంది. రోజూ వ్యాయామం చేస్తాను. ఇంట్లో మంచి తిండి తింటాను. క్రికెట్ ఆడడం కోసం ఇదంతా చేయను. నా దినచర్యే అలా ఉంటుంది.

అలా అంటే ఉండలేను: 2027 ప్రపంచకప్ గురించి ఎప్పట్నుంచో ఏదేదో అడుగుతూ ఉన్నారు. ఆ టోర్నీలో ఆడతావా అని ప్రశ్నిస్తారు. దానికి జవాబేంటో నాకు తెలుసు. నేనెందుకు ఇంటిని వదిలేసి ఇక్కడ ఇలా ఎందుకు కష్టపడతాను.. పరుగులు చేస్తాను? నేను క్రికెట్ ఆడాలనుకుంటున్నా. ఇలాగే కొనసాగాలనుకుంటున్నా. భారత్ తరఫున ప్రపంచకప్ ఆడడం బాగుంటుంది. అది నేను ఒక్కడిని తీసుకునే నిర్ణయం కాదు. కానీ పరస్పరం గౌరవం ఇచ్చుకోవడం కీలకం. నా ఆలోచన విధానం స్పష్టం. జట్టుకు నేను విలువ చేకూర్చగలుగుతాను అంటే.. లేదా నేనుంటే విలువ చేకూరుతుందని జట్టు భావిస్తే నేను అక్కడ ఉంటాను. కానీ నీ విలువేంటో చూపించు అంటే మాత్రం నేను అక్కడ ఉండలేను.

సందేహించా.. కానీ: 50 ఓవర్లలో ప్రతి బంతీ ఇదే నాకు చివరిది అన్నట్లే ఆడతా. కెరీర్లో కూడా ఇదే నాకు చివరి బంతి అనుకుంటుంటా. నా బ్యాటింగ్ అలాగే ఉంటుంది. జట్టు కోసం నా వల్ల అయిందంతా చేయడానికి సిద్ధంగా ఉంటా. నేను నా సన్నాహాల విషయంలో ఎప్పుడూ నిజాయితీగా ఉంటాను. ఆట పట్ల నా దృక్పథం కూడా అలాగే ఉంటుంది. ఆడడానికి వచ్చానంటే ఇంకెవరూ నాలా కష్టపడలేరు అన్న స్థాయిలో శ్రమిస్తా. 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేయడానికి సిద్ధపడే వస్తా. 40 ఓవర్ల పాటు బౌండరీకి అటు ఇటు పరుగు తీస్తూ ఫీల్డింగ్ చేయమన్నా చేస్తా. నేను ఎవరికీ ఏదీ రుజువు చేయాల్సిన అవసరం లేదనే స్పష్టతతో ఉంటా. ఆటను ప్రేమిస్తా కాబట్టే నేను ఎక్కడైనా ఆడగలను. విజయ్ హజారేలో ఆడటం మంచి అనుభవం. ముందు ఇంత సుదీర్ఘ కాలం ఆడాక ఇక్కడ ఆడేందుకు తగ్గ ప్రేరణ వస్తుందా అని సందేహించా. కానీ నా ఆలోచన మారింది. 'నేను ఆటను ప్రేమిస్తా. బ్యాటింగ్‌ను ఇష్టపడతా. మైదానంలో ఎంతమంది ఉన్నారు, ఎవరున్నారు అన్నది విషయం కాదు. ఇది నాకు ఆటకు సంబంధించిన విషయం' అనుకుని బరిలోకి దిగా.

ఒక్క మాటపై ఉండండి

నేను ఆటను ఆస్వాదిస్తా. కానీ ఎవరైనా అదీ ఇదీ అని చెప్పి పరిస్థితులను సంక్లిష్టం చేస్తే నాకు నచ్చదు. మీరేం చెప్పాలనుకున్నారో నిజాయితీగా, స్పష్టంగా చెప్పండి. లేదంటే నా ఆట నన్ను ఆడనివ్వండి. ఒకసారి 'నీ సామర్థ్యంపై నమ్మకముంది' అని చెప్పాక, వారం గడిచాక నేను ఆడే తీరును ప్రశ్నిస్తే ఎందుకిలా చేస్తున్నారు అనిపిస్తుంది. ముందే నీ ఆటతీరు బాగా లేదని అయినా చెప్పాలి. లేదా నా ఆటపై నమ్మకున్నట్లయితే మౌనంగా అయినా ఉండాలి. ఫలితాలు మన చేతిలో ఉండవు. వాటి ఆధారంగా ఆలోచన మారిపోతే మీకు ఎప్పటికీ ఒక నిలకడైన విధానం ఉండదు.